# జ్ఞానోదయం

అంబుజా భూషణ్

నీలాకాశం తెల్లమేఘాల్ని తలనిండా తురుముకొని అందంగా ముస్తాబౌతోంది. మేఘాల్నుంచి రాల్తున్న రేకుల్లా కొంగలు మెల్లమెల్లగా పచ్చపచ్చని పైర్ల మీద వాలుతున్నాయి. ఇంటిముందున్న తోటలో విశ్రాంతిగా కూర్చున్నాడు సాంబశివయ్య. తోటనిండా రంగురంగుల పూలు తుమ్మెదలు వాలి చక్కలిగింతలు పెడుతుంటే పగలబడి నవ్వుతున్నాయి.

వాటిమధ్య అక్కడక్కడా ఎర్రని, తెల్లని, పసుపుపచ్చని గులాబీలు అరచేయంత వెడల్పున విచ్చుకొని కొమ్మలకి చివర మహారాణీల్లా ఊగుతున్నాయి. ఆ గులాబీల్ని చూస్తుంటే భార్య గుర్తొచ్చింది సాంబశివయ్యకి. శకుంతలమ్మకి గులాబీ పూలంటే చచ్చేంత ఇష్టం అని తెలిసి తను ఊరెళ్ళినప్పుడల్లా తామరాకుల్లో అరడజనుకు తక్కువ కాకుండా కట్టించుకు వచ్చేవాడు.

ఆమె నానా తంటాలుపడి ఎక్కడెక్కడ్నుంచో గులాబీ కొమ్మలు తెచ్చి నాటేది. కానీ దురదృష్టం ఒక్కటీ బ్రతికేది కాదు. ఆమె తపన చూచి తనే ఓ పూలకుండీ కొనుక్కొచ్చాడు.

ఆ మొక్క లేలేత చివుళ్ళు తొడుగుతుండే "బుజ్జి ముండనీ" బుల్లి బుల్లి మొగ్గలేస్తుంటే "బంగారుకొండనీ" అయిపోతూ ఇయిపోతూ తెగమురిసిపోయేది.

---

**ఆయనకీ టీవీ చూడాలనే ఉంటుంది. కాని తనక్కడ కూచొని టివి చూడటం శోభినికిష్టం లేదేమో టక్కున ఆపేస్తుంది. లేదా చూపుల్నిండా కారం నింపుకొని ముళ్ళమీద కూర్చున్నట్లుగా ఉంటుంది.....**

---

పెద్దపెద్ద పూలు రావాలని అస్తమానం టీకాచి ఆ పొడి వేస్తూ ఉండేది. బియ్యం కడిగేనీళ్ళు గేదెలకి ఉంచకుండా ఆ చెట్టుకే పోసేది. పొద్దస్తమానం విచ్చుకోబోయే పూలపై నీళ్ళు చిలకరిస్తూ వాటినే చూస్తూ కూర్చునేది. ఎప్పుడొచ్చే వాళ్ళో ఏమో పోకిరీ పిల్లలు తెల్లవారేసరికి ఒక్కపూవు ఉండనిచ్చే వాళ్ళు కాదు. ఆ రోజంతా శకుంతలమ్మ బాధచూడ్లేకపోయేవాడు సాంబశివయ్య.

"ఆ రోజుల్లో ఆ ఒక్క చెట్టుని చూచుకొనే అలా అయ్యేదే. ఇప్పుడు ఇన్నిచెట్లు ఇంతింత పూలు చూస్తుంటే ఎంత మురిసిపోయేదో" అనుకోగానే అతని కళ్ళమ్మట నీళ్ళుబికాయి.

"అబ్బ ఇక్కడున్నావా తాతయ్యా నీ కోసం ఇల్లంతా వెతికొచ్చాం" మనవడు, మనవరాలు వచ్చి అతనికి చెరోపక్కన కూర్చుండేసరికి పంచెతో కళ్ళద్దుకొని

"ఏమర్రా" అంటూ వాళ్ళిద్దర్నీ దగ్గరకు తీసుకున్నాడు ఆప్యాయంగా.

"ఆరోజు ఆపేసిన కథ చెప్పుతాతయ్య" గునిశాడు మనవడు.

"అదేమిట్రా ఇంట్లో మాంచి సినిమా వొస్తోంటే మీకు ఈ ముసలి తాత కథలు కావల్సి వచ్చాయి ముందు అది చూచి రండి తర్వాత చెప్తా" కోడలు శోభిని పిల్లల్ని తన దగ్గర చూస్తే "ఊరుకోదు. పైగా ఇంట్లోనే ఉంది అందుకే తప్పించుకో చూచాడు.

"ఐతే నువ్వూరా" చెయ్యిపట్టుకుంది మనవరాలు.

"నేనా!" సాంబశివయ్య కళ్ళలో బెదురు కనబడింది.

ఆయనకీ టీవీ చూడాలనే ఉంటుంది. కానీ తనక్కడ కూచొని టివి చూడటం శోభినికిష్టం లేదేమో టక్కున ఆపేస్తుంది. లేదా చూపుల్నిండా కారం నింపుకొని ముళ్ళమీద కూర్చున్నట్లుగా ఉంటుం ది. అందుకనే ఆయన కోరిక చంపేసుకొని అటుకేసి పోడు. ఇప్పుడు ఆమె లోపల ఫ్రెండ్స్‌తో చూస్తోంది తను పోటీ.

"రా తాతయ్యా" తొందరచేశాడు మనవడు.

"ఉహు వద్దు బాబూ ఏమిటో అది చూస్తే కళ్ళమ్మట నీళ్ళొస్తాయి" తప్పించుకున్నాడు.

"ఐతే మేము పోము కథ చెప్పేయి" సాంబశివయ్య కథ చెప్తూ కూర్చుండిపోయాడు. చీకటిని తరిమేస్తూ గప్పుగప్పని లైట్లు వెలిగాయి. సినిమా ఐపోయినట్లుంది ఫ్రెండ్స్‌ని గేటుదాకా పంపి తిరిగి వస్తున్న శోభిని తోటలో పిల్లల్ని చూచి కోపంగా అరిచింది.

"ఏం చేస్తున్నార్రా ఇక్కడ"

"కథలు చెప్పించుకుంటున్నామమ్మా"

"హోమ్‌వర్క్ పూర్తి చేశారా" పిల్లలిద్దరూ "లేద"న్నట్లుగా తలలూంచుకున్నారు.

"చదువూ చట్టుబండలు లేకుండా పోచికోలు కథలు వింటూ కూర్చున్నారా"

"మీకైనా తెలీదు పిల్లలకిది చదూకునే టైమని" మామవైపు ఉరిమి చూచింది.

"లోపల గోలగా ఉందనీ" నసిగాడు సాంబశివయ్య.

"ఏమిటీ గోలా నేనూ నా ఫ్రెండ్స్ మాట్లాడుకుంటుంటే గోలగా ఉందా అంత భరించలేని వాడివైతే"

"అహహ అది కాదమ్మా టీవీలో గోలనీ"

"హు" మూతితిప్పి విసురుగా పిల్లల్ని లాక్కెళ్ళింది శోభిని. బాధగా క్రింది పెదవి కొరుక్కుంటూ తనూ లోనికెళ్ళాడు.

ఒకరోజు మార్కెట్‌కెళ్ళి కూరగాయలు తీసుకొచ్చిన సాంబశివయ్యకి ఇంట్లో ఎవరూ కనిపించలేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

"ఎక్కడికెళ్ళారబ్బా" అంతా అనుకుంటూ తోటలో కొచ్చాడు. మనవడు, మనవరాలు ఏడుస్తూ కూర్చుని ఉన్నారు.

"ఏమిటి బాబూ ఏమైంది. ఎందుకమ్మా ఏడుస్తున్నారు" కంగారుగా వాళ్ళని దగ్గర కి

లాక్కున్నాడు. మనవరాలు వెక్కుతూ చెప్పింది" నాన్న అమ్మని కొట్టాడు తాతయ్యా"

"ఏమిటి అమ్మని కొట్టాడా! ఎందుకు?" ఆశ్చర్యపోయాడు.

"వాళ్ళిద్దరూ బాగా పోట్లాడుకున్నారు అందుకనీ"

"హరీ బాబూ ఏమైంది సరిగ్గా చెప్పరా" పెద్దవాడైన మనవణ్ణి ఊపేశాడు.

"మరే మరేమో" తాతయ్య కళ్ళలోకి చూచి నీళ్ళు నమిలాడు హరి.

"చెప్పుబాబూ నేను తాతయ్యని కదూ! అమ్మనెందుకు కొట్టాడు మరి వాళ్ళిద్దరేరి"

"పనిమనుషులున్నా మార్కెట్‌కి నువ్వే వెళతావట. వెళ్ళినా రిక్షాలోనో ఆటోలోనో రాక పంచె ఎగ్గట్టి నడిచివ స్తావట. అది అమ్మ ఫ్రెండ్స్ చూస్తే నామోషీ అట. ఇంకా నువ్వు సోఫామీద కాళ్ళు ఎత్తిపట్టి కూర్చుంటావ ట. ఏమేమో అని నిన్ను పంపెయ్యమంటే నాన్నకొట్టారు"

"అమ్మ ఏడుస్తూ ఎక్కడికో వెళ్ళిపోయింది"

"తర్వాత నాన్న కూడా వెళ్ళాడు దిగులుగా చెప్పాడు హరి"

"మాను"లా నుంచుండిపోయాడు సాంబశివయ్య.

సాంబశివయ్య, శకుంతలమ్మలకి రాజా, రజని ఇద్దరే పిల్లలు. స్వంత ఊర్లో ఐదెకరాల పొలం సాగుచేస్తూ తనకెటూ చదువులేదని పిల్లలిద్దర్నీ చదివించేడు సాంబశివయ్య. సాంబశివయ్యకి కొడుకంటే అతి ప్రేమ.

"ముసలి తనాన తమని చూచేది వాడేననీ తన వం శం నిలబెట్టేవాడనీ" మురిపెంగా ముద్దుగా పెంచుకునేవాడు.

"ఎంతకష్టమైనా కొడుకు అడిగింది లేదనకుండా చేసిపెట్టేవాడు" కొడుకు చదువు ముగించి పెద్ద ఉద్యోగంలో చేరాడు. పెళ్ళాం మాటలు విని కొడుకు కూతురు పెళ్ళికి ఏం సాయం చేయకపోయినా సర్దుకొని రెండెకరాలు అమ్మేసి రజని పెళ్ళి చేశాడు.



కొంతకాలానికి భార్య కన్నుమూసింది. ఆ పల్లెటూళ్ళో వంటరిగా ఉండలేక ఉన్న పొలాన్ని కౌలుకిచ్చి కొడుకు నీడకొచ్చాడు.

"ఇదిగో ఏమయ్యో విన్నే" పక్కింటావిడ కేకకి ఆలోచనల్నుంచి ఇవతలకొచ్చాడు సాంబశివయ్య. చెట్టు కింద మంచం వేసుకుపడుకున్న భర్తని అంటోంది పక్కింటావిడ.

"ఆ చెట్టు నువ్వునాటినదే. ప్రేమగా నీళ్ళుపోసి ఎరువేసి పెంచుకున్నదే. ఐతే మాత్రం దాని మొదట్లోకెళ్ళి పడుండాలా కొమ్మొకటి కిర్రుకిర్రుమంటూ శబ్దం చేస్తోంటే ఎప్పుడిరిగి మీద పడుతుందోనని హడలి వస్తున్నా కొంచెం ఇవతలకి వేసుకోరాదూ. ఇక్కడా నీడా గాలీ వస్తున్నదీ"

సాంబశివయ్యకేదో "జ్ఞానోదయ"మయినట్లయింది ఆమె మాటలకి. రాత్రి ఇంటికొచ్చిన కొడుకుతో అన్నాడు "బాబూ నేను మనూరికెల్తారా ఇక్కడి వాతావరణం నాకు పడినట్లు లేదు"

*